# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 231
పేజీలు : 08 | వెల: రూ.5/-
శుక్రవారం
జూన్ 13, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




## బాధ్యతలు స్వీకరించిన స్నేహ శబరీష్

హనుమకొండ జిల్లా నూతన కలెక్టర్ గా స్నేహ శబరీష్ శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో బాధ్యతలు స్వీకరించారు. నూతన కలెక్టర్ స్నేహ శబరీష్ కు జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వై.వి.గణేష్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, జడ్పీ సీఈవో విద్యాలత, ఇతర శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, కలెక్టరేట్ ఉద్యోగులు పూల మొక్కలు, పుష్పగుచ్ఛాలను అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

– వరంగల్ వాయిస్, హనుమకొండ



8లో..

## మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

- జిల్లాలో చేపల ఉత్పత్తి పెరగాలి
- రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క
- మత్స్యకారులకు తెప్పలు, వలల పంపిణీ



8లో..

## కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన చాహాత్ బాజ్ పేయ్

శుభాకాంక్షలు తెలిపిన వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది



2లో..

## డబ్బు కోసమే మేనత్త హత్య

- పోలీసుల అదుపులో నిందితుడు
- వివరాలు వెల్లడించిన ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్ కుమార్



వివరాలు2లో..

# అటకెక్కిన ఆధునిక వ్యవసాయం



- 8 ఏళ్లుగా నిలిచిన వ్యవసాయ యాంత్రీకరణ పథకం
- రైతులకు అందని రాయితీ పరికరాలు
- అన్నదాతల ఎదురు చూపులు
- అప్పులపాలవుతున్న కర్షకులు
- పునరుద్ధరించాలంటూ వేడుకోలు

రాష్ట్ర వ్యాప్తంగా ఆధునీకరణ వ్యవసాయం అటకెక్కింది. గత ప్రభుత్వ పుణ్యమా అంటూ ఎనిమిదేళ్లుగా వ్యవసాయ యాంత్రీకరణ పథకం నిలిచిపోయింది. పాలకుల నిర్లక్ష్యంతో ఈ పథకంపై నీలినీడలు కమ్ముకున్నాయి. వ్యవసాయంలో యంత్రాల వినియోగాన్ని పెంచి అన్నదాతలకు కూలీల ఖర్చును తగ్గించడమే కాకుండా సమయాన్ని ఆదా చేయాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన వ్యవసాయ యాంత్రీకరణ పథకం పత్తాలేకుండా పోయింది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం నాలుగేళ్ల పాటు వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని కొనసాగించింది. అప్పట్లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు రూ.100కోట్లు కూడా కేటాయించారు. దీంతో రైతులకు వివిధ ఉపకరణాలు సబ్సిడీపై లభించేవి. 2017-18 వరకు కొనసాగిన వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని ఆ తర్వాత నిలిపివేశారు. దీంతో వ్యవసాయ ఖర్చులు పెరిగిపోయాయి. అవసరానికి కూలీలు దొరకక పోవడంతో దిగుబడి తగ్గి అన్నదాతలు అప్పులపాలయ్యారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా తిరిగి వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని పునరుద్ధరించి రైతులకు అండగా నిలువాలని కర్షకులు కోరుతున్నారు.

- వరంగల్ వాయిస్, పరకాల

# అటకెక్కిన ఆధునిక వ్యవసాయం



- 8 ఏళ్లుగా నిలిచిన వ్యవసాయ యాంత్రీకరణ పథకం
- రైతులకు అందని రాయితీ పరికరాలు
- అన్నదాతల ఎదురు చూపులు
- అప్పులపాలవుతున్న కర్షకులు
- పునరుద్ధరించాలంటూ వేడుకోలు

**వరంగల్ వాయిస్, పరకాల :** పాలకుల నిర్లక్ష్యంతో రాష్ట్రంలో వ్యవసాయ యాంత్రీకరణ పథకం ఆగిపోయింది. ఒకవైపు రైతు రాజ్యం అని చెబుతూనే మరోవైపు అన్నదాతలకు పంపిణీ చేసే ఉపకరణాలపై సబ్సిడీలను ఎత్తివేశారు. దీంతో గత ఎనిమిదేళ్లుగా ఈ పథకం ద్వారా రైతులకు ఎటువంటి ప్రయోజనం చేకూరడంలేదు. ఈ పథకం కింద ఇటు రాష్ట్ర ప్రభుత్వ నార్మల్ స్టేట్ ప్లాన్ (ఎన్ఎస్పీ)తో పాటు రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్కేవీవై) ద్వారా కేంద్ర ప్రభుత్వం కూడా రాయితీపై రైతులకు వ్యవసాయానికి ఉపయోగపడే యంత్రాలు, పరికరాలను మంజూరు చేస్తుంటుంది. 2017-18 సంవత్సరం వరకు ఈ పథకం అమలులో ఉంది. ఆ తర్వాత పథకాన్ని అటకెక్కించారు. దీంతో రైతులు విధిలేని పరిస్థితిలో ఎక్కువ మొత్తం వెచ్చించి యంత్రాలు, ఉపకరణాలను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.



## ప్రభుత్వ ప్రోత్సాహం..

రోజు రోజుకూ పెరుగుతున్న కూలీల కొరతనుంచి కూడా గట్టెక్కేందుకు అధునిక వ్యవసాయ మొక్కటే పరిష్కారంగా వ్యవసాయ శాఖ అధికారులు భావించారు. వ్యవసాయంలో యంత్రాలను వినియోగించడం వల్ల రెతులకు పెట్టుబడి ఖర్చు తగ్గడంతో పాటు సమయం కూడా చాలా ఆదా ఆవుతోంది. కూలీల ద్వారా వారం రోజుల్లో జరిగే పని యంత్రాలతో ఒక్క రోజులోనే పూర్తిచేయవచ్చు. మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో 10 ఏళ్ల క్రితంతో పోలిస్తే యంత్రాల వినియోగం బాగా పెరిగింది. చిన్న, సన్నకారు రైతులు సైతం అప్పులు తెచ్చి యంత్రాలు, పరికరాలను సమకూర్చుకుంటున్నారు. ఫలితంగా కూలీల ఖర్చు గణనీయంగా తగ్గుతోంది. దీంతో ఆధునిక వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించడంతోపాటు ప్రభుత్వం ప్రోత్సాహం అందించడం ద్వారా రైతులు వీటి వినియోగంవైపు మరలుతారని భావించారు. అందులో భాగంగానే రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఈ పథకం ద్వారా రైతులకు కొంత ఉరట లభించినప్పటికీ 2018 నుంచి ప్రభుత్వం ఈ పథకాన్ని పూర్తిగా నిలిపివేసింది.

## సబ్సిడీపై యంత్రాలు..

వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా గతంలో రైతులకు 50 శాతం రాయితీపై వ్యవసాయ పరికరాలు, పనిముట్లను ప్రభుత్వం అందజేసేంది. ఎస్సీ, ఎస్టీలకు 95 శాతం రాయితీ కాగా మిగిలిన వర్గాలకు 50 శాతం రాయితీని ఇచ్చేవారు. ట్రాక్టర్లతో పాటు పొలం దున్నడానికి ఉపయోగపడే కల్టివేటర్, రొటోవేటర్, పవర్ టిల్లర్, వరి నాటు యంత్రాలు, పవర్ వీడర్, పురుగుల మందు పిచికారి యంత్రాలు, ఇతర వ్యవసాయ అనుబంధ పరికరాలను రాయితీపై ప్రభుత్వం అందజేయడంతో అనేక మంది వీటిని కొనుగోలు చేశారు. వాటి ద్వారా ఆధునిక వ్యవసాయంవైపు అడుగులు వేశారు. నాగళితో దున్నడం మరిచి ట్రాక్టర్ తో కొన్ని గంటల్లోనే వ్యవసాయ పోలాలను దున్నుతున్నారు.

## ఎదురుచూపులు..

కల్టివేటర్‌ను బయట తయారు చేయించాలంటే రూ.30 నుంచి రూ.50 వేలు అవుతోంది. రొటరేటర్ కొనాలంటే రూ. లక్ష అవుతోంది. పురుగుల మందు పిచికారి యంత్రాల ధర మార్కెట్‌లో రూ.3,000 నుంచి రూ. 10 వేల వరకు పలుకుతోంది. వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలు అయితే ఇవన్నీ సగం ధరకే రైతులకు అందుతాయి. గత ఎనిమిది సంవత్సరాలుగా ఈ పథకాన్ని పాలకులు నిలిపివేయడంతో రైతులపై అధిక భారం పడుతోంది. ఒక్కో వ్యవసాయ పరికరాన్ని బయట కొనుగోలు చేయాలంటే రైతులకు పెద్ద మొత్తంలో ఖర్చు అవుతోంది. దీంతో రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని పునః ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.



# నగరంలో 'పిడుగు'

### మంటలు చెలరేగడంతో ఆందోళన

వరంగల్ ఉర్సు బొడ్రాయి శివాంజనేయ స్వామి దేవాలయం సమీపంలోని కుసుమ సుధాకర్, దయాకర్ ఇంటి ఆవరణలోని కొబ్బరి చెట్టుపై పిడుగు పడి మంటలు చెలరేగాయి. శుక్రవారం సాయంత్రం సుమారు ఆరు గంటల ప్రాంతంలో నగరంలో ఉరుములతో కూడిన వర్షం పడింది. కొబ్బరి చెట్టుపై పిడుగు పడడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే స్థానిక కార్పొరేటర్ మరుపల్ల రవికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. అందరూ కలిసి పైపుల ద్వారా నీటిని చల్లి మంటలను ఆర్పారు. అయితే పిడుగు పడడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లోని ఇళ్లలో ఉన్న టీవీలు, ఫ్రిడ్జ్ లు, కూలర్లు, ట్యూబ్ లైట్లు, ఫ్యాన్లు పాడైపోయినట్లు స్థానికులు తెలిపారు.

– వరంగల్ వాయిస్, వరంగల్

# డబ్బు కోసమే మేనత్త హత్య

- పోలీసుల అదుపులో నింధితుడు
- వివరాలు వెల్లడించిన ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్ కుమార్



**వరంగల్ వాయిస్, క్రైం :** మద్యానికి అలవాటు పడి, జల్సాలకు అవసమైన డబ్బు కొసం మేనత్తను అతిదారుణంగా హత్యచేసి ఒంటి మీద ఉన్న నగలను చోరీ చేసిన మేనల్లుడిని గీసుగొండ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.18లక్షల విలువ కలిగిన సుమారు 170గ్రాముల బంగారం, 34గ్రాముల వెండి అభరణాలతో పాటు రూ.10 వేల నగదు, ద్విచక్ర వాహనం, ఒక సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్ కుమార్ శుక్రవారం వివరాలను వెల్లడించారు. ఈ నెల 7న గీసుగొండ మండలం స్థంబాలపల్లి గ్రామానికి చెందిన కొచన స్వరూప (70) ను గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేసినట్లుగా మృతురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ అదేశాల మేరకు ఈస్ట్‌జోన్ డీసీపీ అధ్వర్యంలో దర్యాప్తు చేపట్టిన గీసుగొండ పోలీసులు వృద్ధురాలి హత్యకు వరంగల్ మట్టెవాడ ప్రాంతం రాజీవ్ కాలనీలో నివాసం ఉంటున్న మృతురాలి మేనల్లుడు రేకులపెల్లి ప్రణయ్ గా పోలీసులు గుర్తించారు. ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న ప్రణయ్ జల్సాలకు అలవాటు పడి పెద్ద మొత్తంలో అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో ఈజీగా డబ్బులు సంపాదించేందుకు తాళం వేసిన ఇళ్లలో చోరీలకు శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. గీసుగొండ, మట్టెవాడ పోలీస్ స్టేషన్ల పరిధిలో రెండు చొప్పున మొత్తం నాలుగు చోరీలకు పాల్పడినట్లు డీసీపీ వెల్లడించారు. అయినా అప్పులు తీరకపోవడంతో పాటు జల్సాలు మరింత చేయసాగాడు. ఈ క్రమంలో గీసుగొండ స్థంబాలపల్లి గ్రామంలో ఒంటరిగా నివాసం ఉంటున్న తన మేనత్తపై దృష్టి పడింది. ఆమె వద్ద పెద్ద మొత్తంలో డబ్బు ఉందని భావించిన ప్రణయ్ ఆమెను చంపి డబ్బు, బంగారం దోచుకోవాలని పథకం రచించాడు. ఈ అలోచనతోనే ఈ నెల 7న తన మేనత్త వద్దకు వస్తున్నట్లుగా సమచారం ఇచ్చాడు. స్థంబాలపల్లి వెళ్ళే మార్గంలో రెండు బీర్లు కొనుగోలు చేశాడు. సాయంత్రం వాటితో తన మేనత్త ఇంటికి చేరుకున్నాడు. అదే రోజు మేనత్తతో కలిసి మద్యం సేవించిన అనంతరం వారి ఇంటిలోనే నిద్రించాడు. మేనత్త గాఢ నిద్రపోతున్నట్లు నిర్ధారించుకున్న నిందితుడు వ్యాయామం చేసే డంబెల్‌తో మేనత్త తలపై విచక్షణా రహితంగా కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మరణించింది. దీంతో మృతురాలి ఒంటిపై ఉన్న బంగారు అభరణాలతో పాటు ఇంటిలోని వెండి సామాను, కొంత డబ్బును దోచుకొని ప్రణయ్ పారిపోయాడు. హత్య చేసే క్రమంలో ప్రణయ్ చేతికి గాయమైంది. అక్కడినుంచి వరంగల్‌లోని తన ఇంటికి చేరుకున్న నింధితుడు రక్తమరలతో కూడిన దుస్తులను తన ఇంటిపై విప్పాడు. అనంతరం ఎంజీఎం ఆస్పత్రికి వెళ్లి చేతికి చికిత్స చేయించుకున్నట్లు నిందితుడు పోలీసుల విచారణలో అంగీకరించాడని వెల్లడించారు. నిందితుడిని పట్టుకొవడం ప్రతిభ కబరిచన గీసుగొండ్ పోలీస్ స్టేషన్, టాస్క్ ఫోర్స్ అధికారులు, సిబ్బందిని డీసీపీ అంకిత్ కుమార్ అభినందించారు.

# ప్రతీ గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

## ● పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

**వరంగల్ వాయిస్, తొర్రూరు:** మండలంలోని ఫతేపురం గ్రామంలో రూ. 10 లక్షల వ్యయంతో సీఆర్ఆర్ నిధుల ద్వారా చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు పాలకుర్తి శాసనసభ్యురాలు యశస్విని రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ప్రజలు సుసంపన్నమైన గ్రామానికి బీజం వేస్తున్న ఈ అభివృద్ధి పనులకు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు సమానంగా అభివృద్ధి చెందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఫతేపురంలో చేపట్టిన ఈ సీసీ రోడ్డుతో ప్రజలకు రాకపోకల్లో సౌలభ్యం కలుగుతుంది. డ్రైనేజీ నిర్మాణంతో వర్షాకాలంలో ఏర్పడే మురికి, నాలా సమస్యలు తగ్గుతాయి. ఇది ఒక ప్రారంభం మాత్రమే. ప్రతి గ్రామంలో ప్రజల అవసరాలు గుర్తించి, మౌలిక సదుపాయాలపై దృష్టి సారించామన్నారు. ప్రభుత్వం అందించే ప్రతి రూపాయి ప్రజల శ్రేయస్సు కోసం ఖర్చవుతుందన్న నమ్మకాన్ని ఇక్కడి ప్రజలకు కలిగించాలన్నదే నా ప్రయత్నమని చెప్పారు. అనంతరం వారి గ్రామస్తులతో ముచ్చటిస్తూ వారి అభిప్రాయాలు, సమస్యలు స్వయంగా విన్నారు. ప్రజలతో బలమైన అనుబంధాన్ని కొనసాగిస్తామన్న నమ్మకంతో కార్యక్రమాన్ని ముగించారు.

**అభివృద్ధి పనులకు శంకుస్థాపన..**

మండలంలోని చెర్లపాలెం గ్రామంలో రూ. 12 లక్షలు, గోపాలగిరి గ్రామంలో రూ. 5 లక్షలు వ్యయంతో సీసీ రోడ్డుడ్రైనేజీ నిర్మాణ పనులకు



పాలకుర్తి శాసనసభ్యురాలు యశస్విని రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ నిధులు సీ ఆర్ ఆర్ పథకం కింద మంజూరయ్యాయి. ఈ కార్యక్రమాల్లో టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, నియోజకవర్గ ఇంచార్జ్ ఝాన్సి రాజేందర్ రెడ్డి పాల్గొని గ్రామ ప్రజలకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ.. చెర్లపాలెం, గోపాలగిరి తమ సొంత గ్రామాలు. ఈ గ్రామాన్ని అన్ని విషయంలో ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేయాలన్నదే తన సంకల్పం అని అన్నారు. ఈ సందర్భంగా టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సి రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే గారు ప్రజల అవసరాలను హృదయపూర్వకంగా గుర్తించి, గ్రామ స్థాయిలో మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జటోత్ హమ్య నాయక్, మండల అధ్యక్షుడు ఎస్ సంతోష్, వైస్ ఎంపీపీ శ్యామ్ సుందర్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, ధర్మారపు మహేందర్, మండల అధికారులు, మండల పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు, పార్టీ శ్రేణులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రంగశాయిపేటలో ఘనంగా అక్షరాభ్యాసం



**వరంగల్ వాయిస్, కరీమాబాద్:** బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 42వ డివిజన్‌లోని ఆదర్శ కాలనీలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, రంగశాయిపేటలో అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి 42వ డివిజన్ కార్పొరేటర్ శ్రీమతి గుండు చందన పూర్ణచందర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పాఠశాలలో ఒకటో తరగతిలో చేరిన విద్యార్థులచే అక్షరాలు దిద్దించి, అక్షరాభ్యాసాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ చందన మాట్లాడుతూ.. నేటి బాలలే రేపటి భారతదేశ భవిష్యత్తు అని, పిల్లలందరూ బాగా చదువుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని, అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఉంటారని ప్రజలు గుర్తించాలని ఆమె అన్నారు. అధిక ఫీజులు చెల్లించి ప్రైవేటు పాఠశాలల్లో చేరవద్దని, అన్ని ఉచితంగా అందిస్తూ నాణ్యమైన విద్యను బోధిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని ఆమె తల్లిదండ్రులకు సూచించారు. ప్రధానోపాధ్యాయులు ఊటుకూరి అశోక్ మాట్లాడుతూ పిల్లల బంగారు భవిష్యత్తుకు పునాది ప్రభుత్వ బడులేనని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడాలని, తమ పాఠశాలలో పిల్లలకు నాణ్యమైన విద్యను అందిస్తామని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయులు వీరాచారి, ప్రవీణ్ కుమార్, సునీల్ కుమార్, శ్రీనివాస్, జ్యోతి, ఉషారాణి, మాధవి పాల్గొన్నారు.

# కరీంనగర్–తిరుపతి రైలుకు మంత్రి పొన్నం కృషి

## వొడితల ప్రణవ్ ధన్యవాదాలు

**వరంగల్ వాయిస్, హుజురాబాద్:** కరీంనగర్ నుంచి తిరుపతికి వారానికి రెండుసార్లు రైలు సేవలు ప్రారంభించడానికి కృషి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు, స్థానిక ఎంపీ బండి సంజయ్‌కు కూడా ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఇక్కడి ప్రాంత ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని, సుదూర ప్రాంతాలకు వెళ్లే వారికి సౌకర్యార్థం ఈ రైలు సేవలు ఎంతో ఉపయోగపడతాయని ప్రణవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో పొన్నం ప్రభాకర్ ఎంపీగా ఉన్న సమయంలో జమ్మికుంట రైల్వే స్టేషన్ అభివృద్ధికి కృషి చేశారని, కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు జమ్మికుంట రైల్వే స్టేషన్‌ను మోడల్ రైల్వే స్టేషన్‌గా మార్చి ఆధునీకరించారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఎంపీగా ఉన్న బండి సంజయ్ రైల్వే స్టేషన్ల అభివృద్ధికి తగిన నిధులు తీసుకురావాలని, మరిన్ని రైలు సర్వీసులు జమ్మికుంటలో ఆగేలా చూడాలని ప్రణవ్ డిమాండ్ చేశారు. అలాగే, నిత్యం ట్రాఫిక్‌తో ఇబ్బంది పడుతున్న ఉప్పల్ రైల్వే ఓవర్ బ్రిడ్జిని త్వరగా పూర్తి చేయాలని కూడా ఆయన కోరారు.

# పశువైద్యశాలల్లో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి

## ● గొర్రెల మేకల పెంపకందారుల డిమాండ్

**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి:** మండలంలోని బానాజీపేట, ఫతేషాపురం, ఇబ్రహీంపూర్, మాదారం గ్రామాలలో రెండో రోజున గొర్రెల మేకల పెంపకందారుల సంఘం (జీఎంపీఎస్) మండల కమిటీ ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించారు. గొర్రెల మేకల పెంపకందారుల సహకార సొసైటీ ఎన్నికలు నిర్వహించాలని ఈ సమావేశాలలో చర్చించారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు గుండా వెంకటయ్య, కార్యదర్శి గద్ద రాజులు మాట్లాడుతూ ఎంతమంది పాలకులు మారినా తమ గొల్లకురుమల బతుకులు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి గ్రామంలో గొర్రెలు, మేకలు, ఆవులు, బర్రెలు ఉన్నప్పటికీ, వాటికి సరిపడా మందులు పశువైద్యశాలల్లో అందుబాటులో ఉండటం లేదన్నారు. పశువైద్యశాలలకు వెళ్లినప్పుడు కాంపౌండర్లు, డాక్టర్లు సరిగా ఉండటం లేదని, మూగజీవాలకు సరైన వైద్యం అందడం లేదని పాడిరైతులు, గొర్రెల కాపరులు వాపోతున్నారని తెలిపారు. అంతేకాకుండా, అనేక పశువైద్యశాలల భవనాలు శిథిలావస్థకు చేరాయని, ఎప్పుడో నిర్మించిన



ఆసుపత్రుల్లో కనీసం బీరువాలు, స్టాండింగ్‌లు కూడా లేవని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే పశువైద్యశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, శిథిలావస్థలో ఉన్న భవనాల స్థానంలో కొత్త వాటిని నిర్మించాలని డిమాండ్ చేశారు. మూగజీవాలకు మెరుగైన వైద్యం అందుబాటులో ఉండాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో కేమిడి వీరస్వామి, గోరిగ రవి, బీరయ్య, చిరాబోయిన ప్రభాకర్, గాజుల లక్ష్మయ్య, రేసు వెంకటయ్య, బండ్ర నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# సర్కారు బడికి ఆర్థిక సహాయం



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** ఖిలాషాపూర్ గ్రామ వాస్తవ్యులైన ఆతికం అమరేందర్ చొరవతో బెస్ట్ రన్నర్స్ ఆర్గనైజేషన్ (యూఎస్ఏ), ఇండియా ప్రతినిధులు మీసాల సురేష్, మీసాల శేఖర్ సహకారంతో ఖిలాషాపురం ఎంపీపీఎస్ ( పెద్దమ్మ గుడి బడి) కి స్కూల్ మొత్తానికి రూ.65000లతో పెయింటింగ్ వేయించారు. గతంలో కూడా రూ.1,50,000లతో బెంచెస్, వాటర్ ఫెసిలిటీ కూడా చేయించడం వల్ల , టీచర్స్ నిరంతర కృషి వల్ల ఈ సంవత్సరం మండలంలోనే అత్యధికంగా 60 మంది కొత్తగా విద్యార్థులు జాయిన్ అయిన పాఠశాలగా మన ఎంపీపీఎస్ ఖిలాషాపూర్ నిలవడానికి ఉపయోగపడింది. ఈ కార్యక్రమానికి హెచ్ఎం యాదవ రెడ్డి అధ్యక్షతన ముఖ్య అతిథిగా ఎంపీడీఓ, ఎంఈఓ, స్కూల్ క్యాంప్లెక్స్ హెచ్ఎం డాక్టర్.భారత రవీందర్, సరాబ్ శ్రీనివాస్, విలేజ్ సెక్రటరీ, ఎంపీపీఎస్ స్కూల్ టీచర్స్, పేరెంట్స్ , బెస్ట్ రన్నర్స్ తాజా మాజీ సర్పంచ్ శ్రీధర్, కె.రాజమౌళి, గడ్డం అంజన్న తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం



**వరంగల్ వాయిస్, తొర్రూరు:** ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలోనీ షెడ్యూల్ లో భాగంగా శుక్రవారం దంతాలపల్లి మండలం దాట్ల ప్రాథమిక పాఠశాలలో ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమంలో నూతనంగా పాఠశాలలో చేరిన చిన్నారులకు వేద మంత్రోచ్చారణల మధ్య అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన దాట్ల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.కృష్ణయ్య మాట్లాడుతూ నూతనంగా చేరిన చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. చిన్నారులు విద్యలో రాణించి, మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులను చేర్పించాలని, ప్రభుత్వం విద్యార్థుల కోసం అనేక సదుపాయాలను కల్పిస్తుందని, గ్రామీణ ప్రాంతంలోని తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాల వైపు మొగ్గుచూపి తమ పిల్లలను సర్కారు పాఠశాలలోనే చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్కే పాషా, ఉపాధ్యాయులు చింతల సురేష్, కే రవీందర్, జి.అనిత, కే.కవిత, రత్నమాల, సీహెచ్ రామచంద్రు, జె.అపర్ణ, అంగన్వాడీ టీచర్ కలమ్మ, స్కావెంజర్ ఉమా, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అదనపు డీసీపీ ప్రభాకర్ రావును కలిసిన మంత్రి కమలాకర్ నేత



**వరంగల్ వాయిస్, వరంగల్:** వరంగల్ జిల్లాలో గతంలో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించి, ప్రస్తుతం లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ అదనపు డీసీపీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన రాయల ప్రభాకర్ రావును శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో మంత్రి కమలాకర్ నేత మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి కమలాకర్ నేత, టీపీసీసీ రాష్ట్ర చేనేత సెల్ కార్యవర్గ సభ్యునిగా, చేనేత ఐక్య వేదిక రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా ఉన్నారు.

# వ్యవసాయ పరిశోధన కార్మికుల సమ్మె

- ఔట్ సోర్సింగ్ పోస్టుల్లో ప్రాధాన్యత ఇవ్వాలి
- కాంట్రాక్టర్ ను తొలగించాలి
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ పరిశోధనా స్థానం, ఆర్ఏఆర్ఎస్ వరంగల్ లో పనిచేస్తున్న కార్మికులను కాలేజీ ఔట్ సోర్సింగ్ పోస్టుల్లో ప్రాధాన్యత ఇచ్చి నింపాలని డిమాండ్ చేస్తూ రెండు రోజులుగా సమ్మె చేస్తున్నారు. శుక్రవారం ఏడీఆర్ చాంబర్ ను సీఐటీయూ ఆధ్వర్యంలో ఐదు గంటల పాటు ముట్టడించారు. కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి, సీఐటీయూ జిందాబాద్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలను ప్రస్తుతం పని చేస్తున్న వారితో నింపాలని, కాంట్రాక్టర్ ను తొలగించాలని, పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ మాట్లాడుతూ గత 20 సంవత్సరాల నుంచి ప్రాంతీయ పరిశోధన కేంద్రం వరంగల్ లో కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్న వారిని కాదని ఇటీవల కాంట్రాక్టర్ మహేష్ 20 మందిని బయట వ్యక్తులను డబ్బులు తీసుకొని ఔట్ సోర్సింగ్ పోస్ట్ ల్లో నింపారని, తక్షణమే వారిని తొలగించి వారి స్థానంలో 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులను ప్రాధాన్యత క్రమంలో తీసుకోవాలని రమేష్ డిమాండ్ చేశారు. ఏండ్ల తరబడి వ్యవసాయ పనులను చేస్తున్న కార్మికులను కాదని కాలేజీలో వాచ్ మెన్, స్వీపర్ పోస్టుల్లో బయట వ్యక్తులను ఎందుకు నియమించారో విచారణ చేపట్టాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. పేద కార్మికులకు అన్యాయం చేస్తున్న కాంట్రాక్టర్ ను తొలగించి ప్రస్తుతం పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

### ఏడీఆర్ ఉమారెడ్డితో చర్చలు..

ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులను కార్మికులను ఏడీఆర్ ఉమారెడ్డి చర్చలకు ఆహ్వానించారు. మంగళవారం వరకు సమస్యను పరిష్కారం చేస్తానని, విచారణ చేసి ప్రస్తుతం పని చేస్తున్న వారికి న్యాయం జరిగే విధంగా చూస్తానని ఆందోళన విరమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ యూనియన్ నాయకులు ఎస్. రఘు, నమసాని రమాదేవి, గొల్ల సునీత, లింగయ్య, బాలు, ముంజ మంజుల, సరిత, ఎస్.సులోచన, లింగం, లలితలతో పాటు కార్మికులు పాల్గొన్నారు.

## చర్లపల్లి పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో బడిబాటలో భాగంగా శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. హనుమకొండ జిల్లా విద్యాశాఖ అధికారిణి వాసంతి ముఖ్య అతిథిగా హాజరై సరస్వతి మాత విగ్రహానికి పూలమాలవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వేద మంత్రోత్సవాల మధ్య పండితులు మంత్రాలు చదవగా సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. డీఈఓ విద్యార్థులను తన ఒడిలో కూర్చోబెట్టుకొని అక్షరాభ్యాసం చేయడం జరిగింది. అదేవిధంగా మండల విద్యాశాఖ అధికారీ కున్సోతు హనుమంతరావు, కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ బద్దం సుదర్శన్ రెడ్డి, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నూతి వేణుగోపాలస్వామి, చర్లపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రకాష్ రావు, చర్లపల్లి మాజీ సర్పంచ్ చాడ తిరుపతిరెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కందికట్ల రమ, అంగన్వాడీ సూపర్ వైజర్ శ్రీదేవి, భీముడి లక్ష్మి, తాళ్లపల్లి మంజుల, శీలం సరిత, విద్యార్థులను తమ ఒడిలో కూర్చోబెట్టుకొని సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కున్సోతు హనుమంతరావు, సీఎంఓ బద్దం బాల్ రెడ్డి, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నూతి వేణుగోపాలస్వామి, చర్లపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రకాష్ రావు, అంగన్వాడీ సూపర్వైజర్ శ్రీదేవి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ రమా, పాఠశాల ఉపాధ్యాయులు లకావత్ దేవా, కంచ రాజ్ కుమార్, మేకల సత్యపాల్, ఐఆర్ టీ రమేష్, అంగన్వాడీ టీచర్స్ భీమిడి లక్ష్మీ, నందిపాటి సంధ్యా, తాళ్లపల్లి మంజుల, శీలం సరిత, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు శిక్షణ



**వరంగల్ వాయిస్, పరకాల:** స్థానిక మండల వనరుల కేంద్రంలో పాఠశాల పారిశుద్ధ్యంపై స్వచ్ఛ వర్కర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారిణి శ్రీమతి రమాదేవి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఆర్పీ బి.భిక్షపతి, స్కావెంజర్ సందీప్ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని పాఠశాలల స్వచ్ఛ వర్కర్లు పాల్గొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్యకరమైన పరిసరాలు కూడా ఉండాలని, ఆ పరిశుభ్రతను స్వచ్ఛ వర్కర్లు నిర్వహించాలని, ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షించాలని ఎంఈఓ రమాదేవి తెలియజేశారు. ఈ సమావేశంలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కూడా హాజరయ్యారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఎమ్మార్సీ ఆవరణలో ప్రయోగపూర్వకంగా పిచ్చి మొక్కలను తొలగించి, కార్యాలయంలోని అన్నిటినీ శుభ్రపరిచారు. ఇదే రీతిలో మీ మీ పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంఈఓ కోరారు.

## ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ



**వరంగల్ వాయిస్, దామెర :** మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని పేదలకు అందిస్తున్న ఇందిర మ్మ ఇండ్లు మంజూరైన లబ్ధి దారులు భూమిపూజను నిర్వ హించారు. ఈ కార్యక్రమం పంచాయతీ కార్యదర్శి నరేష్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దురిశెట్టి భిక్షపతి, కారోబార్ బొబ్బిలి, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఘోర విమాన ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలి



**వరంగల్ వాయిస్, వరంగల్:** గుజరాత్‌లోని అహ్మదాబాద్ సర్దార్ వల్లభాయ్ పటేల్ ఎయిర్‌పోర్ట్ నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిర్ ఇండియా బోయింగ్ 787 విమానం కూలిపోయిన ఘోర ప్రమాదంలో 241 మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బీకేఎంయూ) జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విమానంలో మొత్తం 230 మంది ప్రయాణికులు (169 మంది భారతీయులు, 53 మంది బ్రిటన్ పౌరులు, 7 మంది పోర్చుగీస్, 1 కెనడియన్) 12 మంది విమాన సిబ్బంది ఉన్నారని, క్షణాల్లో కాలి బూడిదై గుర్తుపట్టలేని విధంగా మారడం హృదయ విచారకరమన్నారు. కూలిన విమాన శకలాలు బీజే మెడికల్ కాలేజీ హాస్టల్‌పై పడటంతో పదుల సంఖ్యలో మెడికల్ విద్యార్థులు, డాక్టర్లు, సిబ్బంది మరణించడం మరింత విషాదకరమని ఆయన పేర్కొన్నారు. ఈ ఘోర ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారందరికీ సంతాపాన్ని, ఘన నివాళులర్పిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రమాదానికి గల కారణాలు ఏమైనప్పటికీ, వందలాది మంది మరణించడంతో వారి కుటుంబ సభ్యుల రోదనలు వర్ణనాతీతమన్నారు. మరణించిన కుటుంబాలకు పెద్ద మొత్తంలో ఎక్స్‌గ్రేషియా చెల్లించి, వారిని అన్ని విధాలా ఆదుకోవాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు అన్ని రకాల సహాయ సహకారాలు అందించాలని వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రమాదం జరిగిన తీరుపై సమగ్రంగా, నిష్పక్షపాతంగా న్యాయ విచారణ జరిపించి తగు చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా చిత్తశుద్ధితో చర్యలు చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## పేదలకు అండగా ఇందిరమ్మ ఇళ్లు



**వరంగల్ వాయిస్, రేగొండ:** కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షాన నిలుస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, మాజీ ఉప సర్పంచ్ గండి తిరుపతి గౌడ్ అన్నారు. శుక్రవారం ఉమ్మడి రేగొండ మండల కేంద్రంలోని ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ఎంపికైన లబ్ధిదారుడు వెంగళ లావణ్య, కిరణ్ ఇంటి నిర్మాణ పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతి ఒక్క నిరుపేద కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిధులను మంజూరు చేస్తుందని, యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ నాయకులు మంతెన సతీష్, ఫ్రీవిల్ యూత్ అధ్యక్షుడు కందుకూరి కృష్ణ, మంతెన సురేష్, మార్త రవీందర్, బొద్దుల రాము, వెంగళ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# సాగు భూమి పట్టాల కోసం రైతుల ఆందోళన




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలంటూ సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో మద్దివంచ గ్రామ గిరిజన, గిరిజనేతర రైతులు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట శుక్రవారం బైఠాయించి తీవ్ర ఆందోళన నిర్వహించారు. తమ సాగు భూములకు పట్టాలు మంజూరు చేసి, ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని నినాదాలతో కలెక్టరేట్ పరిసరాలను హోరెత్తించారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గౌని ఐలయ్య మాట్లాడుతూ గత 70 ఏళ్లుగా మద్దివంచ గ్రామ రెవెన్యూ పరిధిలోని 116, 119 సర్వే నంబర్లలోని 900 ఎకరాల్లో గిరిజన, గిరిజనేతర రైతులు సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. అయితే ప్రభుత్వం ఇప్పటివరకు వారికి పట్టాలు ఇవ్వకపోవడంతో బ్యాంక్ రుణాలు, రైతు రుణమాఫీ, రైతు బంధు వంటి పథకాలు వర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములను దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్నామని, పట్టాల కోసం పలుమార్లు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, సాగు చేసుకుంటున్న భూములకు తక్షణమే పట్టాలు అందజేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని గౌని ఐలయ్య హెచ్చరించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో గిరిజన, గిరిజనేతర రైతులు, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నేతలు పాల్గొన్నారు.

# సమగ్ర భూగర్భ మురుగునీటి వ్యవస్థపై చర్చాగోష్ఠి



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** వరంగల్ అభివృద్ధి విజన్ డాక్యుమెంట్ రూపకల్పనలో భాగంగా, సమగ్ర భూగర్భ మురుగునీటి వ్యవస్థ ప్రాముఖ్యతపై హనుమకొండలోని మాస్టర్ జి కళాశాలలో క్రియేట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఒక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆచార్య గడ్డం భాస్కర్ అధ్యక్షత వహించారు. సమగ్రమైన భూగర్భ మురుగునీటి వ్యవస్థ యొక్క ప్రాముఖ్యత, ఎదురయ్యే ఆటంకాలు, ప్రజలకు తాత్కాలికంగా కలిగే ఇబ్బందులు, దీర్ఘకాలిక ప్రయోజనాలు, సాంకేతిక సమస్యలు, పరిపాలనా సౌలభ్యం గురించి సాంకేతిక నిపుణులు, మేధావులు, సామాజిక విశ్లేషకులు అందించే సమాచారంతో భూగర్భ మురుగునీటి వ్యవస్థ ప్రయోజనాలను ప్రజలకు తెలియజేయాలనే కృతనిశ్చయంతో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఆచార్య భాస్కర్ తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న సాంకేతిక నిపుణులు, రిటైర్డ్ ఎస్.ఈ. ఎం. రాజేశ్వరరావు మాట్లాడుతూ.. భూగర్భ మురుగునీటి వ్యవస్థ గురించి 1979లోనే సర్వే చేశామని, అప్పట్లో వరంగల్ పరిధి, జనాభా తక్కువగా ఉండేవని గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం పెరుగుతున్న జనాభా, ప్రజల డిమాండ్లకు అనుగుణంగా దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును అమలుపరచడానికి రూ. 417 కోట్లకు 'ఇన్ ప్రిన్సిపాల్' గా నవంబర్ 17, 2024న ఆమోదం తెలిపిందని వివరించారు. ఈ ప్రాజెక్టును పటిష్టంగా అమలుపరచడానికి ప్రత్యేకంగా పబ్లిక్ హెల్త్ ఎస్.ఈ., సాంకేతిక నిపుణులను నియమించి పర్యవేక్షించాలని ఆయన సూచించారు. డిజిటల్ సాంకేతికత, గూగుల్ మ్యాపింగ్ కంటే ఫీల్డ్ సర్వే, ప్రత్యక్షంగా నిపుణుల కమిటీ పర్యవేక్షణలో జరిగినప్పుడే గరిష్ట ప్రయోజనాలు పొందటానికి అవకాశాలుంటాయని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు అమలుకు దాదాపు నాలుగు సంవత్సరాల కాలం పడుతుందని, ప్రజల తాత్కాలిక ఇబ్బందులను కనిష్ట స్థాయిలో పరిష్కరించి అమలు చేయాలని కోరారు. ఈ ప్రాజెక్టు అమలుకు ఎదురయ్యే అనేక సవాళ్లను అధిగమించడానికి సరైన పరిశోధన, పర్యవేక్షణ, ప్రణాళికాయుతమైన ఆచరణ ద్వారానే సమగ్ర భూగర్భ మురుగునీటి వ్యవస్థ ప్రజలకు ఉపయోగపడే విధంగా రూపాంతరం చెందుతుందని, క్రియేట్ స్వచ్ఛంద సంస్థ ప్రజలకు ఉపయోగపడే సభలు, సమావేశాలు మరిన్ని జరపాలని రాజేశ్వరరావు కోరారు. ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్న కాకతీయ విశ్వవిద్యాలయం ఈసీ మెంబర్, ఫోరం ఫర్ బెటర్ వరంగల్ అధ్యక్షుడు పుల్లూరి సుధాకర్ మాట్లాడుతూ.. భూగర్భ మురుగునీటి వ్యవస్థ నిర్మాణంలో అనేక సాంకేతిక అంశాలు ఉన్నందున మురుగునీటి కాలువల నిర్మాణం మధ్యలో డిస్‌కనెక్ట్ కాకుండా ఎస్‌టీపీ వరకు కొనసాగడం అత్యంత ఆవశ్యకమని తెలిపారు. వీటి అమలుకు ఉన్నతమైన విలువలతో కూడిన నాయకత్వం కావాలని, ప్రస్తుతం మురుగు కాలువల వల్ల కలిగే దుష్ఫలితాలు, అనారోగ్య పరిస్థితులు, పందుల విహారం, కలుషితమైన వాతావరణం వంటివి ప్రజా జీవనంపై పడకుండా ఆరోగ్యవంతమైన, సౌకర్యవంతమైన జీవనాన్ని కొనసాగించడానికి ఈ ప్రాజెక్టు తోడ్పడుతుందని వివరించారు. మాజీ ఉపకులపతి ఆచార్య మహమ్మద్ ఇక్బాల్ అలీ, ఆచార్య కే. విజయ్ బాబు, మాస్టర్ జి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రూలా రామ్, వైద్యం రాజగోపాల్, రాజేందర్ కుమార్, బండా వివేకానందం పాల్గొన్నారు

# అధ్యాపకులు ఇంటర్ విద్యలో మార్పులను గమనించాలి



**వరంగల్ వాయిస్, జనగామ :** ప్రభుత్వ ఇంటర్ విద్యలో త్వరలో విప్లవాత్మక మార్పులు ప్రవేశపెట్టనున్నట్లు ఇంటర్ బోర్డు డిప్యూటీ సెక్రటరీ చిత్రం యాదగిరి తెలిపారు. ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య ఆదేశాల మేరకు ఈ మార్పులు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం జనగామలోని ధర్మకంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్, అధ్యాపకుల బృందం నిర్వహిస్తున్న అడ్మిషన్ల ప్రక్రియను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ, విద్యార్థులకు అనుకూలంగా బోధనా పద్ధతులు పాటిస్తూ వారిలోని దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీయాలని సూచించారు. ప్రతి జూనియర్ కళాశాలలోనూ జూనియర్ లెక్చరర్ల వారీగా అడ్మిషన్ల లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని పూర్తిచేయాలని ఆదేశించారు. దీనికోసం అధ్యాపకులు 90 రోజుల కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకొని, తదనుగుణంగా బోధించాలని సూచించారు. కళాశాలల్లో యోగా, ధ్యానం, వ్యక్తిత్వ వికాసం, క్రీడలకు ప్రత్యేక తరగతులను నిర్వహించాలని కూడా ఆయన అన్నారు. కళాశాలల్లో అడ్మిషన్ల సంఖ్యను పెంచాలని, నాణ్యమైన బోధనను అందించాలని అధ్యాపకులకు సూచనలు చేశారు. అనంతరం జనగామ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ప్రవేశాల కోసం రూపొందించిన ప్రచార కరపత్రాలను ప్రిన్సిపాల్, కళాశాల సిబ్బందితో కలిసి ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నామిని పావని, అధ్యాపకుల బృందం మరియు కళాశాల ఆఫీస్ స్టాఫ్ పాల్గొన్నారు.

# శాకరాశి కుంట అభివృద్ధికి కృషి చేస్తా



**వరంగల్ వాయిస్, వరంగల్:** నగర అభివృద్ధికి కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి అన్నారు. నగరంలోని అండర్ రైల్వే గేట్ ప్రాంతం మురికి కాలువలతో ముంపునకు గురవుతోందని, దీనికి శాశ్వత పరిష్కారం కోసం మంత్రి కొండా సురేఖ అన్ని చర్యలు తీసుకున్నారని ఆయన పేర్కొన్నారు. శాకరాశి కుంట 39వ డివిజన్ అభివృద్ధికి తాను పాటుపడతానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కతేరశాల వేణుగోపాల్, బాసాని శ్రీనివాస్, ముత్యాల విజయ్, కాంగ్రెస్ లీగల్ సెల్ ఛైర్మన్ శామంతుల శ్రీనివాస్, మహిళా నాయకురాళ్లు రావుల విజయరామచందర్, రాధిక, కవిత, మెడిది రజిత తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు మే నెల పెండింగ్ వేతనం చెల్లించాలి

● రామ రాజేష్ ఖన్నా డిమాండ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 2025 మే నెల వేతనంతో పాటు పెండింగ్‌లో ఉన్న 7 నెలల పీఆర్సీ (పీఆర్సీ) బకాయిలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్, జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా డిమాండ్ చేశారు. శుక్రవారం ఉద్యోగులతో కలిసి హనుమకొండ జిల్లా డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ అల్లం అప్పయ్యకు ఆయన వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య మిషన్ స్కీంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వం క్యాడర్లను ఏర్పాటు చేసిందని, పనికి తగిన క్యాడర్ నిర్ణయించి దానికి సమానమైన మూల వేతనాన్ని అమలు చేయాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, హెల్త్ కార్డ్స్, హెల్త్ ఇన్సూరెన్స్ ఉద్యోగికి, వారి కుటుంబ సభ్యులందరికీ వర్తించే విధంగా ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి, మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు మంజూరు చేయాలి, ప్రతి నెల 1న వేతనం చెల్లించాలి, ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ అప్పయ్యను రాష్ట్ర నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆచంటి అభిషేక్ పాల్గొన్నారు.

# ఘనంగా అక్షరాభ్యాస వేడుకలు



**వరంగల్ వాయిస్, కరీమాబాద్:** వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 32వ డివిజన్ కార్పొరేటర్ పల్లం పద్మ రవి శుక్రవారం ఆకారపు వీరలక్ష్మి ప్రభుత్వ పాఠశాలలో జరిగిన అక్షరాభ్యాస కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రధానోపాధ్యాయులు ఎస్. రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కొత్తగా అడ్మిషన్లు పొందిన 15 మంది విద్యార్థులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కార్పొరేటర్ పల్లం పద్మ రవి జ్యోతి ప్రజ్వలన చేసి సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 15 మంది విద్యార్థులకు అక్షరాలు దిద్దించి, వారికి పుస్తకాలు, నోట్‌బుక్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పల్లం పద్మ రవి మాట్లాడుతూ, ప్రొఫెసర్ జయశంకర్ బడి-బాట కార్యక్రమంలో పాల్గొన్న ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయులను అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు అడ్మిషన్లు తీసుకోవడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. స్థానిక డివిజన్‌లోని తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. పాఠశాలలో చేరిన విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, వారికి అన్ని విధాలా అందుబాటులో ఉంటామని తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌తో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.రాజు, ఉపాధ్యాయులు కవిత, శోభారాణి, రాధిక, శ్రీధర్, వాసుదేవ్, అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, కళ్యాణి, సబిత, స్వరూప, సరిత, లత, సునీత, ఆశా వర్కర్లు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు

## తల్లిదండ్రులకు ట్రాఫిక్ పోలీసుల హెచ్చరిక

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ:** మైనర్‌లు వాహనాలు నడపడంపై వరంగల్ ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలకు ఉపక్రమించారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో తొమ్మిది మంది మైనర్ డ్రైవర్లను గుర్తించి, వారిపై జువైనల్ కోర్టులో ఛార్జిషీట్లు దాఖలు చేయగా, జువైనల్ మేజిస్ట్రేట్ వారిని ఒక రోజు బాలల అబ్జర్వేషన్ హోమ్‌కు పంపినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కె. రామకృష్ణ తెలిపారు. ఇకపై వాహనాలు నడిపే మైనర్‌లను పట్టుకొని ఛార్జిషీట్ ఫైల్ చేసి కోర్టు ముందు హాజరుపరచడమే కాకుండా, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ కూడా ఇవ్వబడుతుందని పోలీసులు స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన తొమ్మిది మంది వాహనదారులకు వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అబ్బోజు వెంకటేశం రూ. 3,900 జరిమానా విధించారు. అలాగే, డ్రంకెన్ డ్రైవ్ కేసులో హాజరుపరచిన 28 మందికి రూ. 37,700 జరిమానా విధించినట్లు సీఐ రామకృష్ణ వెల్లడించారు.

# కళాకారుడికి కన్నీటి వీడ్కోలు



**వరంగల్ వాయిస్, పరకాల :** మండలంలోని వెల్లంపల్లి గ్రామానికి చెందిన పెండ్యాల రంజిత్ క్యాన్సర్ వ్యాధితో మృతి చెందిగా శుక్రవారం తమ స్వగ్రామంలో అంతిమయాత్రలో పాల్గొని పాడే మోసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రభు మాట్లాడుతూ రంజిత్ తన శాస్త్రీయ డప్పు దరువుతో వందల ప్రభుత్వ, ప్రైవేట్, సామాజిక ఉద్యమ కార్యక్రమాలు చేసి వేల మంది హృదయాల్లో స్థానం సంపాదించాడన్నారు. ముఖ్యంగా ఎస్సీ వర్గీకరణ సాధన కోసం సుదీర్ఘంగా లక్ష డబ్బులు వేల గొంతుల కార్యక్రమంలో ముఖ్య భూమిక పోషించి, పద్మశ్రీ అవార్డు గ్రహీత ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ మన్ననలు పొందారని తెలిపారు. వందల మంది డప్పు కళాకారులకు తనకున్న డప్పు, దరువు నైపుణ్యాలను నేర్పించి, ఇటీవల క్యాన్సర్ వ్యాధి సోకడంతో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందడం అత్యంత బాధాకరమని, డప్పు కళాకారులకు తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో డప్పు కళాకారులు అంబాల శ్రీరామ్, జీడి మోహన్, డప్పు రాదా, కవులు, కళాకారులు పాల్గొన్నారు.

# ఓసీలకు ఉత్తమ శాఖలు.. బీసీలకు ఉత్తిత్తి శాఖలా?

## బీసీ సంక్షేమ సంఘం ప్రశ్నాస్త్రం



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** రాష్ట్ర మంత్రివర్గంలో ఓసీలకు (ఓపెన్ కేటగిరీ) ఉత్తమ శాఖలను కేటాయించి, బీసీలకు (బ్యాక్‌వర్డ్ క్లాసెస్) ప్రాధాన్యత లేని శాఖలను కేటాయించడం దేనికి నిదర్శనమని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ ముఖ్యమంత్రి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సామాజిక న్యాయం పాటిస్తామని చెప్పిన రాహుల్ గాంధీ మాటలకు విలువ లేదా అని ప్రశ్నించారు. రాష్ట్ర జనాభాలో 16 శాతం ఉన్న అగ్రవర్ణాలకు అత్యంత కీలకమైన, బడ్జెట్ ఉన్న 7 మంత్రి పదవులను కేటాయించి, 86 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రాధాన్యత లేని, బడ్జెట్ లేని 8 మంత్రి పదవులను కేటాయించడం ఇదెక్కడి సామాజిక న్యాయం అంటూ నిలదీశారు. అన్ని ప్రాధాన్యత, బడ్జెట్ ఉన్న శాఖలు ఓసీలకు కేటాయించి, బీసీలకు మాత్రం ప్రాధాన్యత లేని, బడ్జెట్ లేని శాఖలు కేటాయించడం సమంజసం కాదని వేణుగోపాల్ గౌడ్ ఆరోపించారు. బీసీ మంత్రులకు బస్సులు, గుడులు, చెట్లు, బర్రెలు, గొర్రెలు, చేపలకు సంబంధించిన శాఖలు కేటాయించి బీసీలకు కూడా మంత్రులను చేశామని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఆయన విమర్శించారు. ఎన్నికల ముందు కామారెడ్డి డిక్లరేషన్‌లో భాగంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పాలనలో మాత్రం సామాజిక న్యాయం పాటించడం లేదని విమర్శించారు. మిగిలి ఉన్న 3 మంత్రి పదవులలో రెండు బీసీలకు కేటాయించాలని, అదేవిధంగా మంత్రివర్గంలో మార్పులు చేసి ప్రాధాన్యత కలిగిన మంత్రి పదవులను బీసీలకు కేటాయించాలని వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ డిమాండ్ చేశారు.

# పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత




**వరంగల్ వాయిస్, చిట్యాల:** చిట్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో 8 నెలల క్రితం పోగొట్టుకున్న రియల్‌మీ ఫోన్‌ను పోలీసులు తిరిగి బాధితుడికి అందజేశారు. జడల్‌పేట గ్రామానికి చెందిన దొడ్ల రమణారెడ్డి అనే వ్యక్తి పోగొట్టుకున్న తన ఫోన్‌ను శుక్రవారం చిట్యాల హెడ్ కానిస్టేబుల్ చంద్రమౌళి అప్పగించినట్లు తెలిపారు. సీఈఐఆర్ (CEIR) పోర్టల్ ద్వారా ఈ మొబైల్‌ను చిట్యాల కానిస్టేబుల్ లాల్ సింగ్ గుర్తించి తీసుకువచ్చారు. చిట్యాల ఎస్ఐ జి. శ్రావణ్ కుమార్ ఆదేశాల మేరకు ఈ మొబైల్‌ను బాధితుడికి అందించారు.

# రౌడీ షీటర్లకు సీఐ కౌన్సిలింగ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ పీఎస్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లందరినీ శుక్రవారం ఇన్ స్పెక్టర్ శివకుమార్ పోలీస్ స్టేషన్ కు పిలిపించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలిగించిన ఊరుకునేది లేదని, భూతగాదాలలో తల దూర్చవద్దని, సరైన నడవడికతో ఉండాలని కౌన్సిలింగ్ నిర్వహించారు. అలాగే కౌన్సిలింగ్ కి రాని రౌడీషీటర్ల పేర్లు ఐడెంటిఫై చేసుకొని మరోకసారి వారికి కౌన్సెలింగ్ ఇస్తామని తెలిపారు.

# ఆధార్, పాన్ కార్డులతో వాహనాల మోసం

- నిందితుడి అరెస్ట్
- రూ. 10 లక్షల విలువైన వాహనాలు సీజ్




**వరంగల్ వాయిస్, మట్టెవాడ:** అమాయక ప్రజల ఆధార్, పాన్ కార్డులను ఉపయోగించి వాహనాలను కొనుగోలు చేసి, వాటిని మోసపూరితంగా విక్రయించి ఈఎంఐలు చెల్లించకుండా భారీ మోసానికి పాల్పడిన వరంగల్ కొత్తవాడకు చెందిన బిట్ల సందీప్ (30)ను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రూ. 10 లక్షల విలువైన 9 ఆక్టివా వాహనాలు, ఒక టీవీఎస్ జూపిటర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తవాడ, ఇంటి నెం: 11-25-165 నివాసి అయిన బిట్ల సందీప్ గతంలో రెడీమేడ్ బట్టల వ్యాపారం నిర్వహించి నష్టపోయాడు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో మోసాలకు పాల్పడ్డాడు. తనకు తెలిసిన అమాయక ప్రజల నుంచి ఆధార్, పాన్ కార్డులను సేకరించాడు. షోరూమ్‌ల నుంచి ఆక్టివా వాహనం కొంటున్నానని, దానికి సాక్ష్యం కోసం ఇవి అవసరమని నమ్మబలికి, ఒకరికి తెలియకుండా మరొకరి వద్ద నుంచి కార్డులను సేకరించాడు. ఈ విధంగా పది వాహనాలను వివిధ ఫైనాన్స్ సంస్థల వద్ద బిట్ల సందీప్ తీసుకున్నాడు. ఆధార్, పాన్ కార్డులు ఇచ్చిన వారికి ఫైనాన్స్ తీసుకున్న విషయం చెప్పకుండా, ఈ వాహనాలు దసరా ఆఫర్‌కు చెందినవని, లేదా దళిత బంధు పథకం కింద వచ్చాయని, ఈ ఆఫర్ల గురించి షోరూమ్ షాపు వారికి మాత్రమే తెలుసు అని మోసపూరిత మాటలు చెప్పి ఒక్కో వాహనాన్ని రూ. 70 వేలకు అమ్మాడు. రిజిస్ట్రేషన్ కూడా చేయిస్తానని నమ్మబలికాడు. అయితే, నిందితుడు ఈఎంఐలు కట్టకపోవడంతో, ఫైనాన్స్ సంస్థల నుంచి రిజిస్ట్రేషన్ దారులకు మెసేజ్‌లు వెళ్లాయి. దీంతో మోసం వెలుగులోకి వచ్చింది. బాధితులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు, దర్యాప్తు చేపట్టి శుక్రవారం నిందితుడు బిట్ల సందీప్‌ను అరెస్ట్ చేసి, మోసానికి ఉపయోగించిన పది వాహనాలను సీజ్ చేశారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



**వరంగల్ వాయిస్, శాయంపేట:** ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా, శాయంపేటలోని స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రెండవ రోజు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పాఠశాలను మామిడి తోరణాలు, బెలూన్లతో అలంకరించడంతో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా సీఎంఓ బి. సుదర్శన్ రెడ్డి, శాయంపేట మండల విద్యాశాఖ అధికారి గడ్డం భిక్షపతి, పత్తిపాక కాంప్లెక్స్ హెడ్ మిస్ట్రెస్ మాధవి, స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత, పత్తిపాక ప్రాథమిక పాఠశాల ఎల్ఎఫ్ఎల్ హెడ్‌మాస్టర్ తిరునగరి శ్రీనివాస్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల కొత్తగట్టు సింగారం ప్రధానోపాధ్యాయులు రాజా యుగేందర్, స్థానిక ప్రాథమిక పాఠశాల శాయంపేట హెడ్‌మాస్టర్ అశోక్ రెడ్డి పాల్గొన్నారు. వారితో పాటు ఉపాధ్యాయులు, ఏఏపీసీ కమిటీ చైర్‌పర్సన్ టీ. లావణ్య, అధిక సంఖ్యలో గ్రామస్తులు హాజరయ్యారు. జిల్లా సీఎంఓ బి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందిస్తున్నారని, ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలను తప్పకుండా ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలల కంటే దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేశారని తెలియజేశారు. మండల విద్యాశాఖ అధికారి గడ్డం భిక్షపతి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచాలని, అలాగే ప్రతి నెలా జరిగే పీటీఎం (పేరెంట్ టీచర్ మీటింగ్) కార్యక్రమంలో ప్రతి తల్లిదండ్రి పాల్గొని విద్యార్థుల ప్రగతిని తెలుసుకోవాలని సూచించారు.

# ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులు అరికట్టాలి

## బీసీ రాజ్యాధికార సమితి డిమాండ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజుల వసూళ్లను అరికట్టాలని, విద్యా హక్కు చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్, వరంగల్ జిల్లా ఇన్‌చార్జి వంగ రవి యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో ఫీజుల నియంత్రణకు వారు హనుమకొండ, వరంగల్ డీఈలను కలిసి వినతిపత్రాలను అందజేశారు. ప్రైవేటు పాఠశాలలు అడ్డూ అదుపు లేకుండా ఫీజులు వసూలు చేస్తున్నాయని, దీనిని తక్షణమే నియంత్రించాలని కోరారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ఏ ప్రకారం పేదలకు ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యను అందించాల్సి ఉండగా, ప్రతి తరగతిలో 25 శాతం సీట్లను ఇందుకోసం కేటాయించాల్సి ఉన్నప్పటికీ ప్రైవేటు యాజమాన్యాలు ఈ విధానాన్ని విస్మరిస్తున్నాయని ఆరోపించారు. 2009 విద్యా హక్కు చట్టంలోని 12(1)(సి) నిబంధనను కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు పాఠశాలల్లో విద్య బోధించే ఉపాధ్యాయులకు సైతం సరైన వేతనాలను సకాలంలో అందజేయాలన్నారు. ప్రభుత్వ నిర్ణయాలను పాటించకపోతే పాఠశాలల యాజమాన్యాలపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని బీసీ రాజ్యాధికార సమితి నేతలు ప్రభుత్వాన్ని కోరారు.

# ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అవకతవకలు

- బీఆర్ఎస్ నాయకుల ఆరోపణ




**వరంగల్ వాయిస్, చిట్యాల:** ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అనేక అవకతవకలు జరిగాయని, నిజమైన లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించలేదని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు అల్లం రవీందర్ ఆరోపించారు. శుక్రవారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గుంట భూమి కూడా లేని పేదల పేర్లను తొలగించి, భూస్వాముల పేర్లను చేర్చారని అన్నారు. "ఇది ప్రజల ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకుంటూ, వాస్తవానికి కార్యకర్తల ప్రభుత్వంగా వ్యవహరిస్తోంది. ఇందిరమ్మ ఇళ్లు కేవలం తమ కార్యకర్తలకు, కుటుంబ సంబంధితులకు మాత్రమే ఇప్పిస్తున్నారు. ఇది సమంజసం కాదు. ఇలా ఒంటెద్దు పోకడతో వెళ్తే ప్రజలు త్వరలో బుద్ధి చెబుతారు" అని రవీందర్ హెచ్చరించారు. అర్హులైన వారందరికీ న్యాయం చేయాలని బీఆర్ఎస్ చిట్యాల మండల అధ్యక్షుడు అల్లం రవీందర్, మాజీ జడ్పీటీసీ గొర్రె సాగర్ డిమాండ్ చేశారు. ఇప్పటికైనా న్యాయ విచారణ జరిపి అర్హులందరికీ ఇళ్లు ఇవ్వాలని, లేనిపక్షంలో దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. నిరుపేదల పక్షాన పోరాటం చేయడానికి బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ ముందు ఉంటుందని తెలిపారు. అర్హులకు ఇళ్లు ఇవ్వకుండా నాయకులకు ఇళ్లు ఇస్తూ ఇష్టారీతిన వ్యవహరిస్తే ప్రజల నుండి తప్పకుండా శిక్ష అనుభవిస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పిట్ట సురేష్, బీఆర్ఎస్ పార్టీ యూత్ మండల అధ్యక్షుడు నవీన్, బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శులు ఎరుగొండ రాజేందర్, మడికొండ రవీందర్ రావు, జిల్లా మండల నాయకులు దామెర రాజు, వీరస్వామి, పెరుమాండ్ల రవి తదితరులు పాల్గొన్నారు.

# అమితాబ్ వర్క్ హాలిక్

## 2గంటల్లోనే యాడ్ ఫిలిం పూర్తి చేశా

అమితాబ్ బచ్చన్ 82 ఏళ్ల వయసులోనూ చలాకీగా చురుకుగా ఉంటారు. పని ఉంటే ఠక్కున పూర్తి చేస్తారు. సినిమా షూటింగ్‌లు కూడా ఇలాగే పూర్తి చేస్తారు. తన డైలీ లైఫ్ `టసైల్‌ను తెలియజేస్తూ అగ్ర నటుడు అమితాబ్ బచ్చన్ తరచూ బ్లాగ్‌లో పోస్టులు పెడుతుంటారు. తాజాగా ఆయన తన వర్క్ లైఫ్ గురించి పోస్ట్ పెట్టారు. సుమారు 2 గంటల్లోనే తాను చాలా వర్క్స్ చేశానని చెప్పారు. వర్క్‌లో తన స్పీడ్ చూసి ఒక దర్శకుడు చమత్కారం చేశాడని అన్నారు. ఇంత స్పీడ్‌గా వర్క్ చేయడం కరెక్ట్ కాదని దర్శకుడు తనతో చెప్పారని ఆయన పేర్కొన్నారు. పని చేయడంలో ఎంతో ఆనందం ఉంటుంది. కేవలం రెండు గంటల్లో ఐదు సినిమాలు, రెండు ఫొటోషూట్‌ల కోసం వర్క్ చేశా. అవన్నీ కూడా ఒక వాణిజ్య ప్రకటన కోసమే అయినప్పటికీ ఇంత త్వరగా వాటిని పూర్తి చేసినందుకు ఎంతో సంతోషంగా అనిపించింది. వర్క్‌లో నా స్పీడ్ చూసి దర్శకుడు, సిబ్బంది షాకయ్యారు. పని చేసే విధానాన్ని నేను పాడుచేస్తున్నానంటూ ఆయన చమత్కారం చేశారు. కానీ, నాకు మాత్రం ఇలా వర్క్ చేయడం చాలా సంతోషంగా అనిపించింది. సినిమా పైనే ఆధారపడే ఎంతోమంది కార్మికులను దృష్టిలో ఉంచుకుని వారి కోసమే నేను వరుస వర్క్స్ చేస్తున్నా అని అమితాబ్ బచ్చన్ పేర్కొన్నారు. తాను కెరీర్ ప్రారంభించిన నాటినుంచి ఇప్పటివరకూ సినీ ప్రపంచంలో తాను ఎన్నో మార్పులు చూశానని ఆయన రాసుకొచ్చారు. ఈ వయసులోనూ ఆయన వరుసగా ప్రాజెక్టులు చేయడంపై నెటిజన్లు హర్షం







## జూలై18న లాక్ చేసిన హరిహరవీరమల్లు?

ఎన్నో వాయిదాల తర్వాత హరిహర వీరమల్లు సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తుందని అందరూ భావించిన తరుణంలో, సిజీ వర్క్స్ పూర్తి కాకపోవడంతో సినిమాను నిరవధికంగా వాయిదా వేశారు. నిజానికి, ఈ సినిమా 12న రిలీజ్ కావాల్సి ఉంది. విజువల ఎఫెక్ట్స్ కోసం రిలీజ్ చేయడం లేదని అనౌన్స్ చేశారు. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమాను వచ్చే నెల 18వ తేదీన ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమాను డైరెక్టర్ క్రిష్ మొదలుపెట్టారు, కానీ బడ్జెట్ సమస్యల కారణంగా ఆయన తప్పుకోవడంతో, నిర్మాత ఏ.ఎమ్. రత్నం కుమారుడు జ్యోతి కృష్ణ దర్శకత్వం వహించి సినిమాను పూర్తి చేశాడు. ఈ సినిమా రెండు భాగాలుగా రూపొందుతోంది. మొదటి భాగం ఇప్పుడు రిలీజ్‌కు సిద్ధమవుతోంది. నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తోంది.ఈ సినిమా వచ్చే నెల రిలీజ్ అయితే, ఈ నెల మొత్తం బాక్స్ ఆఫీస్ కాస్త డల్‌గానే ఉండే అవకాశం కనిపిస్తుంది. తెలంగాణ రాబిన్ హుడ్‌గా పేరున్న పండుగ సాయన్న బయోపిక్‌గా ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు– గతంలో ప్రచారం జరిగింది. మొగల్ కాలంలో వారిని ఎదిరించి, దోచి, పేదలకు పంచిపెట్టాడని ప్రచారం ఉంది. ఈ పాత్రలో పవన్ కళ్యాణ్ ఒదిగిపోయాడని అంటు–న్నారు. మొత్తానికి, ఈ సినిమా రిలీజ్ డేట్‌ను అధికారికంగా ప్రకటించే వరకు నమ్మలేం. అధికారికంగా ప్రకటించినా, సినిమా రిలీజ్ అయ్యే వరకు వస్తుందా లేదా అనేది చెప్పలేని పరిస్థితి.



## రాజాసాబ్ టీజర్ విజువల్స్ లీక్

### షేర్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

ప్రభాస్ కథానాయకుడిగా మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న రొమాంటిక్ కామెడీ హారర్ ఫిల్మ్ 'ది రాజా సాబ్' జూన్ 16న ఈ సినిమా టీజర్ విడుదల కానున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దీనికి లీకుల బెడద మొదలైంది. టీజర్ విజువల్ వీడియోలు కొన్ని నెట్టింట లీక్ అయ్యాయి. దీనిపై టీమ్ స్పందించింది. లీక్ కంటెంట్‌ను షేర్ చేసేవాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఎవరైనా 'రాజాసాబ్' కంటెంట్‌కు సంబంధించిన అనధికారక వీడియోలు, ఫొటోలు షేర్ చేస్తే వారి సోషల్ మీడియా అకౌంట్‌ను తక్షణమే నిలిపివేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొంది. సినిమాటిక్ అనుభూతిని అందించేందుకు చిత్రబృందం ఎంతో కష్టపడుతోందని దానికి అందరూ సహకరించాలని కోరింది. ప్రభాస్ మొదటిసారి హారర్ నేపథ్యంలో ఉన్న కథలో నటిస్తుండటంతో అందరి దృష్టి 'ది రాజాసాబ్' పైనే ఉంది. డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా ఇది విడుదల కానుంది. ఈ ఈవెంట్‌లో 'రాజాసాబ్' కోసం వేసిన భారీ సెట్‌ను కూడా చూపించనున్నట్లు– తెలుస్తోంది. ఇందులో మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధికుమార్, సంజయ్‌దత్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## కూలీలో నన్ను కొత్తగా చూస్తారు..

### నటుడు నాగార్జున వెల్లడి

టాలీవుడ్ అగ్ర కథానాయకుడు నాగార్జున ప్రస్తుతం రెండు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఇప్పటికే 'కుబేర' విడుదలకు సిద్ధం కాగా.. మరోవైపు ఆయన నటించిన 'కూలీ' చిత్రం కూడా ఆగస్టులో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ రెండు సినిమాలకు సంబంధించి తాజాగా ఆసక్తికర విషయాలను పంచుకున్నారు నాగార్జున. ఒక ఇంటర్వ్యూలో నాగార్జున మాట్లాడుతూ.. దర్శకుడు శేఖర్ కమ్ముల అంటే తనకెంతో అభిమానమని తెలిపారు. తనతో 15 ఏళ్లుగా సినిమా చేయాలని చూస్తున్నాను. 'కుబేర'తో ఆ కల నెరవేరింది. శేఖర్ చిత్రాలు మిగతా సినిమాలకంటే చాలా భిన్నంగా ఉంటాయి. అయితే 'కుబేర' కథతో నా దగ్గరికి వచ్చినప్పుడు నేను షాక్ అయ్యాను. శేఖర్... నువ్వు నిజంగానే ఈ సినిమా చేయాలనుకుంటు న్నావా?' అని అడిగాను. అప్పుడు శేఖర్ అవును అని తెలిపాడు. 'కుబేర' కోసం శేఖర్ ఎంతో రీసెర్చ్ చేశాడు. ఈ సినిమాలో ఆయన చెప్పిన కొన్ని ఆసక్తికర విషయాలు విని నేనే షాక్ అయ్యాను. న్యాయంపై ఆయనకు బలమైన నమ్మకం ఉంది. ఏదో ఒక స్కామ్‌నో లేదా ఏ ఒక్కరినో ఆధారంగా చేసుకొని ఈ కథ రాయలేదు. సమాజంలో చూస్తున్న విషయాలనే ఇందులో చెప్పారు. పేద, ధనిక, మధ్యతరగతి కుటుంబాల్లో ఏం జరుగుతుందనే దాన్ని ఇందులో చూపించారు. ఇక 'కూలీ' సినిమా విషయానికి వస్తే, ఈ చిత్రంలో నా పాత్ర కీలకంగా ఉండబోతుంది. ఈ సినిమాలో నన్ను నేను చూసుకుని షాక్ అయ్యాను. దర్శకుడు లోకేష్ కనగరాజ్ నన్ను కొత్తగా చూపించబోతున్నాడు. ఇది పూర్తిగా మాస్ ఎంటర్–టైనర్‌గా రాబోతోంది అంటూ నాగార్జున వివరించారు.



# మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

- జిల్లాలో చేపల ఉత్పత్తి పెంచాలి
- రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క
- మత్స్యకారులకు తెప్పలు, వలల పంపిణీ



**వరంగల్ వాయిస్, ములుగు :** మత్స్యకారులు జిల్లాలో చేపల ఉత్పత్తిని పెంచుతూ సామాజిక, ఆర్థిక స్థితిని మెరుగుపర్చుకోవాలని రాష్ట్ర పంచాయతి రాజ్ శాఖ మంత్రి సీతక్క సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని గిరిజన భవన్ లో యూఎస్ టి, నిర్మాణ్ సంస్థ ఆధ్వర్యంలో జీవంతరావుపల్లి గ్రామంలోని ముదిరాజ్ కులానికి చెందిన 25 కుటుంబాలకు తెప్పలు, చేపలు పట్టే వలలను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్ లతో కలసి మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ జీవంతరావుపల్లి గ్రామంలో అధికంగా ఉన్న మత్యకారులకు నిర్మాణ్ సంస్థ వారు తెప్పలు, వలలు అందించడం అభినందిందనీయం అన్నారు. అదే విధంగా నిర్మాణ్ సంస్థ వారికి అభినందనలు తెలిపారు. జీవంతరావు పల్లి గ్రామాన్ని ప్రభుత్వ పథకాల అమలులో పైలట్ ప్రాజెక్టు గ్రామంగా ఎన్నుకుని ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల మంజూరు, ములుగు మున్సిపాలిటీలో కలవడం, గ్రామానికి డబుల్ రోడ్డు, సెంటర్ లైటింగ్ తో అభివృధి జరుగుతుందన్నారు. మోడల్ గ్రామంగా నిర్మించుకుని అందరూ ఉపాధి అవకాశాలు వినియోగించుకోవాలని మంత్రి అశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాణ్ సంస్థ ప్రతినిధులు, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, పీఏసీఎస్ చైర్మన్లు, డైరెక్టర్లు, గ్రామస్థులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

### నీటి శుద్ధీకరణ యంత్రం ప్రారంభం..

ప్రతి ఇంటికి కాలుష్య రహిత తాగు నీటిని అందించేందుకు నీటి శుద్ధీకరణ యంత్రాన్ని ఏర్పాటు చేసినట్లు మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయ ఆవరణంలో మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన నీటి శుద్ధీకరణ యంత్రాన్ని ను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్ లతో కలసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మునిసిపాల్ కమిషనర్ సంపత్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, మాజి పంచాయతీ కార్యదర్శి రఘు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు అండగా టీడబ్ల్యూజేఎఫ్

- ఘనంగా తృతీయ మహాసభలు
- ఏకగ్రీవంగా హనుమకొండ జిల్లా నూతన కమిటీ ఎన్నిక
- అధ్యక్ష కార్యదర్శులుగా టీవీ రాజు గౌడ్, అంతడుపుల శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్టులందరికీ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ అండగా ఉంటుందని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మామిడి సోమయ్య, బి.బసవ పున్నయ్య అన్నారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో టీడబ్ల్యూజేఎఫ్ మూడో మహాసభను ఘనంగా నిర్వహించారు. ఈ సభకు టీడబ్ల్యూజేఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు టీవీ రాజు గౌడ్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మామిడి సోమయ్య, బి.బసవ పున్నయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య మాట్లాడుతూ రాష్ట్రంలోని జర్నలిస్టుల సంక్షేమం కోసం పాటుపడుతున్న ఒకే ఒక్క ఫెడరేషన్ టీడబ్ల్యూజేఎఫ్ అన్నారు. జర్నలిస్టులనుంచి టీడబ్ల్యూజేఎఫ్ కు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేని కొందరు యూనియన్ నాయకులు మాపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ రెండు యూనియన్లలో ఒక యూనియన్ గత ప్రభుత్వానికి వంతపాడితే, మరో యూనియన్ ప్రస్తుత ప్రభుత్వానికి వంత పాడుతుందని ఎద్దేవా చేశారు. టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవ పున్నయ్య మాట్లాడుతూ జర్నలిస్టులకు అనేక సౌకర్యాలు కల్పిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రస్తుత ప్రభుత్వం కూడా జర్నలిస్టులకు మొండి చేయి చూపిందని ఆరోపించారు. వర్కింగ్ జర్నలిస్టులకు కొత్తగా అక్రిడేషన్ ఇవ్వకుండా మూడు నెలలకు ఒకసారి స్టిక్కర్ల పేరుతో కాలాపన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా జర్నలిస్టుల సంక్షేమం గురించి ఆలోచించి వారికి న్యాయం చేయాలని కోరారు. టీడబ్ల్యూజేఎఫ్ జాతీయ కార్యదర్శి ఆనందం మాట్లాడుతూ రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టుల అందరికీ రూ.20 వేల పెన్షన్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బొక్క దయాసాగర్ మాట్లాడుతూ టీడబ్ల్యూజేఎఫ్ యూనియన్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వివిధ సంఘ నాయకులు వెంటనే క్షమాపణ చెప్పాలని హెచ్చరించారు. అనంతరం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ హనుమకొండ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా టీవీ.రాజు, కార్యదర్శి అంతడుపుల శ్రీనివాస్, కోశాధికారి ఈసంపల్లి రమేష్, ఉపాధ్యక్షులు దామెర రాజేందర్, సంయుక్త కార్యదర్శులు మండ రాజేష్, ఈర్ల తిలక్, కార్యవర్గ సభ్యులు కొండ్రు దయాకర్, ఎల్లంకి జగపతిరావు, మారుపట్ల శంకర్, కె.ప్రవీణ్, డి.రవీందర్, ఏకు రవికుమార్, ఎంఎస్.రావు, సయ్యద్ అలీ, బొల్లపల్లి రాజు నియమితులయ్యారు. దీనితోపాటుగా నేషనల్ కౌన్సిల్ సభ్యులు చుంచు ఐలయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బొక్క దయాసాగర్, పోలమారి గోపాల్, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా కమిటీ అధ్యక్షులు గూడెల్లి నాగేందర్, కార్యదర్శి దాసరి విజయ్ కుమార్, కోశాధికారి బానోత్ దేవేందర్, వరంగల్ పశ్చిమ నియోజకవర్గం కమిటీ అధ్యక్షులుగా గిరెడ్డి అనిల్ రెడ్డి, కార్యదర్శి దామర వెంకటేష్, కోశాధికారి గూగులోతు హుస్సేన్ నాయక్ ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి.బసవ పున్నయ్య ప్రకటించారు.









# కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన చాహాత్ బాజ్ పేయ్

### శుభాకాంక్షలు తెలిపిన వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ మహా నగర పాలక సంస్థ నూతన కమిషనర్ గా చాహాత్ బాజ్ పేయ్ శుక్రవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వివిధ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేస్తానని ప్రకటించారు. కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ గా పనిచేసినందున మున్సిపల్ సర్వీసులపై అవగాహన ఉందని స్పష్టంచేశారు. సానిటేషన్ పై ప్రత్యేక దృష్టి సారించి నగర పరిశుభ్రతకు తోడ్పడడంతో పాటు వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే లక్ష్యం, భవన నిర్మాణ అనుమతులకు జారీ చేసే విధానాన్ని, శానిటేషన్ విభాగంలో విధులు నిర్వహించే సిబ్బంది సంఖ్య , చెత్త తరలింపు జరిపే వాహనాలకు జీపీఎస్ అనుసంధానం, తదితర అంశాలను సంబంధిత విభాగాల అధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్ని విభాగాల అధికారులు సిబ్బంది సహకారంతో నగర అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం బల్దియాలోని వివిధ విభాగాల ఉన్నతాధికారులు, సిబ్బంది కమిషనర్ కు పుష్పగుచ్చాలు, పూల మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కమిషనర్ కు శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో డిప్యూటీ కమిషనర్ (అడ్మిన్) రాజేశ్వర్, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఇంచార్జి ఎస్ఈ, సిటీ ప్లానర్ లు శ్రీనివాస్, రవీందర్ రాడేకర్, పీఆర్ఓ ఆయుబ్ అలీ, డిప్యూటీ కమిషనర్లు రవీందర్, ప్రసన్న రాణి, ఈఈలు, డీఈలు, ఆర్ఓలు, ఆర్ఐలు తదితరులు పాల్గొన్నారు.

### కలెక్టర్లను కలిసిన కమిషనర్..

బల్దియా కమిషనర్ గా శుక్రవారం బాధ్యతలు చేపట్టిన చాహత్ బాజ్ పాయ్ హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు పి.ప్రావీణ్య, డాక్టర్ సత్య శారదలను ఆయా జిల్లాల కలెక్టర్ కార్యాలయాల్లో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్లు కమిషనర్ కు శుభాకాంక్షలు తెలియజేశారు.



# ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం

**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** ధర్మసాగర్ మండలం క్యాతంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం అంగరంగ వైభవంగా సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బండ రమేష్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ధర్మసాగర్ మండల విద్యాధికారి డాక్టర్ రాంధాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాంధాన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య లభిస్తోందన్నారు. విద్యార్థులకు ఉచిత విద్యతోపాటు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, టెక్ట్స్ బుక్ లు, యూనిఫాం, మధ్యాహ్నం భోజనం లభిస్తోందన్నారు. క్యాతంపల్లిలోని ప్రతి ఒక్కరు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ స్వప్న, మాజీ ఉపసర్పంచ్ రాజు, గ్రామస్తులు ఉమాదేవి, పాఠశాల ఉపాధ్యాయులు ఇన్నారెడ్డి, కేశవరెడ్డి, కిషన్, సంపత్ రెడ్డి, మాధవి, అంగన్వాడీ టీచర్ మమత తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com